క్లుప్తంగా

కబడ్డీ క్రీడాకారిణికి అభినందనలు



రన్నరప్ ట్రోఫీతో జ్యోతిక, పీడీ సుహాసిని

ఎన్పీకుంట: టీ.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఆసం జ్యోతిక రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిందని హెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు. 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ లో భాగంగా సోమవారం బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 ఫైనల్ కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం, ఉమ్మడి అనంతపురం జట్టు తలపడ్డాయన్నారు. ఇందులో అనంతపురం జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జ్యోతికను, వ్యాయామ ఉపాధ్యాయిని సుహాసిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల ప్రిన్సిపాల్, పీఈటీ

కనగానపల్లి: స్థానిక కస్తూర్బా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నరసమ్మ తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఏపీ స్కూల్ గేమ్స్‌లో భాగంగా జిల్లాస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థినులు అర్చన, వెన్నెల, హేమలత, హరిప్రియా ప్రతిభ కనబరచటంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొన్న మేనక అనే విద్యార్థి మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు క్రీడాకారిణులతో పాటు పీఈటీ గురుప్రియాను ప్రత్యేకంగా అభినందించారు.

బాలిక అదృశ్యం



పూర్ణచంద్రిక

కదిరి టౌన్: స్థానిక ఎన్‌జీఓ కాలనీలో నివాసముంటున్న రవికుమార్ కుమార్తె పూర్ణచంద్రిక ఈ నెల 10వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదు. మైనర్ బాలిక నాయనమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న మెడికల్ షాపునకు వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో అడపాల వీధికి చెందిన రాజు అనే వ్యక్తిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు జయప్రదం చేయండి

కనగానపల్లి: ఈ నెల 14వ తేదీ నుంచి జరిగే గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎంఈఓ అరుణమ్మ కోరారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ల విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. ఎంఐఎస్ రామన్న, సీఆర్‌పీలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర.. అక్రమాల జాతర!

- యంత్రాలతో ఉపాధి పనులు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- అవినీతిని ప్రోత్సహిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది
- పనులు కల్పించాలంటున్న కూలీలు



ఎలుకుంట్ల వద్ద జేసీబీతో మామిడి మొక్కల సాగుకు గుంతలు తీస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పనుల్లో నిబంధనలకు పాతరేసిన సిబ్బంది అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా ఉపాధి హామీ పథకం ఉద్దేశమే నీరు గారిపోతోంది. గ్రామీణ ప్రజలకు పనులు లేని సమయంలో వలసలు నివారించడానికి ఉన్న ఊళ్లోనే ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజులు గ్యారెంటీ పనులను కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టింది. అయితే కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సిన అధికారులు యంత్రాలతో పనులు చేయిస్తూ కూలీల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యంత్రాలతో గుంతలు..

ధర్మవరం మండలంలో ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మండలంలో సుమారు 150 ఎకరాల్లో మామిడి, చీనీ, జామ మొక్కలను నాటుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. ఇటీవల పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అధికారులు సీసీరోడ్ల నిర్మాణంతోపాటు పండ్లతోటల సాగు కోసం గ్రామాల వారీగా పనులను ప్రారంభించారు. పండ్లతోటలను సాగు చేసుకునే రైతుల పొలాల్లో ఉపాధి పనులు చేయవచ్చని గ్రామాల్లోని కూలీలు ఆశ పడ్డారు. అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. పనులు కావాలని ఎదురు చూస్తున్న కూలీలకు ఇదిగో పనులు కల్పిస్తాం...అదిగో పనులు కల్పిస్తామంటూ ఉపాధి సిబ్బంది చెబుతూ వచ్చారు. అయితే రాత్రికి రాత్రే యంత్రాలతో పనులు చేసి బిల్లుల కోసం మస్టర్లను సిద్ధం చేస్తున్నారని తెలియడంతో కూలీలు నివ్వెరపోతున్నారు.

పట్టించుకునే వారేరీ?

కూలీల ద్వారా పనులు చేయించాల్సిన చోట యంత్రాలతో పనులు జరిగిపోతున్నాయి. యంత్రాలతో పనులు జరుగుతున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు తమ కేమి పట్టనట్లుగా ఉంటున్నారు. దీంతో క్షేత్ర స్థాయి ఉపాధి సిబ్బంది యథేచ్ఛగా అవినీతిని ప్రోత్సహిస్తున్నారు. యంత్రాలతో పనులు చేసి కూలీలు పనులు చేసినట్లుగా మస్టర్లను సిద్ధం చేస్తున్నారు. బిల్లులు పడితే మీకింతా...మా కొంత అనే నినాదంతో ఎంపిక చేసిన కూలీలతో ఉపాధి సిబ్బంది ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం,

కూలీలతోనే పనులు చేయించాలి

ఉపాధి హామి పథకం పనులను కూలీలు మాత్రమే చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోను యంత్రాలతో పనులు చేయించకూడదు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. మొక్కలు నాటేందుకు కూలీల ద్వారా రైతుల పొలాల్లో పనులు చేయిస్తాం.

అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ, ధర్మవరం మండలం

పనులు లేక ఇళ్ల వద్దనే కూలీలు

ధర్మవరం మండలంలో చాలా గ్రామాలు కొండ ప్రాంతాల్లో ఉన్నాయి. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో తండాలు, ఎస్సీ కాలనీలు అధికంగా వున్నాయి. ఈ గ్రామాలకు చెందిన కూలీలు ధర్మవరం పట్టణానికి 25 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నారు. ఈ గ్రామాల్లోని కూలీలు పనుల కోసం పట్టణానికి రాలేని పరిస్థితి. అసలే వ్యవసాయ పనులు లేక చాలా మంది కూలీలు ఇళ్ల వద్దనే ఉంటున్న పరిస్థితి. ఇలాంటి తరుణంలో ఉపాధి కల్పించాల్సిన అధికారులు యంత్రాలతో పనులు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని కూలీల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పొట్ట నింపుకోవడం ఎలా అని గ్రామీణ ప్రాంత కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

ఎన్పీకుంట: పంటల సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని ఎన్.పీ.కుంట–1, ధనియానిచెరువు రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వరి పంటలను పరిశీలించి, రైతులకు మెలకువలను వివరించారు. కార్యక్రమంలో రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్‌లు, జెడ్పీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంటీఎస్ అమలు చేయాలి

ఎన్పీకుంట: కేజీబీవీ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయినులకు ఎం టీఎస్ (మినిమమ్ టైమ్ స్కేల్) వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కేజీబీవీ పాఠశాలతో పాటు మండల, జిల్లా పరిషత్ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలల్లో వార్డెన్ పోస్టును మంజూరు చేయాలని, అన్ని మేనేజ్‌మెంట్లలోని ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇవ్వాలని, పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. అలాగే పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ నాయకులు చింతా శ్రీనివాసులు, రమణారెడ్డి, ఆనంద్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

రూ.31 వేల నిధుల దుర్వినియోగం

ఓడీచెరువు: మండల కేంద్రంలోని సమీకృత బాలుర వసతి గృహం ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక గ్రామసభ ఏర్పాటు చేశారు. 2023–2024 ఏడాదిలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో గుర్తించిన నిధుల దుర్వినియోగంపై నివేదికను వెల్లడించారు. మొత్తం 1831 పనులకుగాను 6.54 కోట్లతో పనులు చేపట్టామన్నారు. రూ.31 వేలు నిధులు దుర్వినియోగం తేల్చామన్నారు. రికవరీ చేయాలని పీడీ విజయ్ ప్రసాద్ ఆదేశించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం

ధర్మవరం: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ ధ్వజమెత్తారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో చేనేత పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పి కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం కేటాయింపులు కూడా చేయకపోవడంతో దారుణమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించి చేనేత కార్మికులకు నేతన్ననేస్తం కింద రూ.24 వేలు ఏడాదికి వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు



ఎన్పీకుంట: మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

తాడిమర్రి: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. చిల్లవారిపల్లిలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని గుట్టవీధిలో డ్రెయినేజీ సమస్య ఉందని కొందరు మహిళలు తెలపడంతో ఆయన అక్కడికి వెళ్లి పరిశీలించారు. మండల సర్వేయర్ సుశాంతి, జూనియర్ అసిస్టెంట్ దినేష్ ఉన్నారు.

ఎన్పీకుంట: దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం చేపట్టి గ్రామసభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ నరేంద్రకుమార్‌ అన్నారు. మంగళవారం మరికొమ్మదిన్నె సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. కాగా గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తెలియచేయలేదని పలువురు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన తహసీల్దార్ మరోసారి ఇలా జరగదని, గ్రామసభ నిర్వహించే ముందు తప్పకుండా గ్రామస్తులకు తెలియజేస్తామన్నారు. అనంతరం పలు రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఎంపీటీసీ తిమ్మారెడ్డి, తిరుమలనాయుడు, ఆంజినప్పనాయుడు, వీఆర్‌ఓ రఘు పాల్గొన్నారు.

గాండ్లపెంట: గొడ్డువెలగల గ్రామంలో మంగళవారం రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు–11, పక్కా ఇళ్లు కావాలని 27 మంది, పింఛన్లు మంజూరు చేయాలని 21 మంది దరఖాస్తులు ఇచ్చారని తహసీల్దార్ బాబురావు తెలిపారు.

కనగానపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముక్తాపురం గ్రామంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. భూముల ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు తారుమారు చేయటం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని రైతులు చంద్రశేఖర్, లింగమయ్య ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌కు విన్నవించారు. పర్వతదేవరపల్లి ఎస్సీ కాలనీలో తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సీనియర్ అసిస్టెంట్ దేవిపుత్ర, ఆర్‌ఐ సరళ, వీఆర్వో చెన్నేకేశవులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ముష్టికోవెల గ్రామంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో ఆరు వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

బత్తలపల్లి: మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. మంగళవారం గరిశలపల్లిలో సర్పంచు మాదిరెడ్డి పద్మావతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రస్తా సమస్యలపై రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నల్లచెరువు: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పిన్సిపాల్ రాజా ప్రతాప్ నాయక్, పీడీ హరీష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూబేస్ బాల్ పోటీలకు దివ్య, భానూ రెడ్డి, నిహారిక, సాఫ్ట్ బాల్ పోటీలకు భరణి, మేఘన, ఫెన్సింగ్ పోటీలకు యమున, షంరూన్, భరత్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు.

వికసిత్ భారత్‌లో వ్యవసాయం పాత్ర కీలకం



దీక్షారంభ్‌లో పాల్గొన్న అగ్రీ యూనివర్సిటీ బృందం

పుట్టపర్తి అర్బన్: 'వికసిత్ భారత్‌లో జీడీపీ పెరగడానికి వ్యవసాయ శాఖ సహకారం ఎనలేనిది. రాయలసీమలో వ్యవసాయం చేయడంలో పెను సవాళ్లను అధిగమించి రాణించాలి. దీని ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో వలసలను పూర్తిగా అరికట్టవచ్చు' అని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు దీక్షారంభ్ పేరుతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ అగ్రికల్చర్ విద్యార్థులకు వ్యవసాయ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకొని తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఆవిష్కరిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. రైతులకు వాతావరణ మార్పులు, గిట్టుబాటు ధరలు, ఉత్పాదకత పెంపు, నీటి వనరుల రూపంలో పెను సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. వీటిని అధిగమిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఈ దిశగా ప్రయోగాలు చేస్తూ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ రామ్‌గోపాల్ మోపూరి, వైస్ చాన్స్‌లర్ అనురాధ ధర్, రిజిస్ట్రార్ జై ప్రకాష్ , ఏఓ ఫహిజా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి హమాలీ క్వార్టర్స్‌లో బేల్దారి రమణ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియల నిమిత్తం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ముబారక్, శ్రీరాములు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లి సమీపంలో గంటలమారెమ్మ కనుమ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు... కనుమ వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్న ఘటనలో అనంతపురానికి చెందిన దేవేంద్ర కుమారుడు శరత్‌కుమార్ (2) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడిన దేవేంద్ర, శరత్‌కుమార్‌ను స్థానికులు వెంటనే సత్యసాయి ఆస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి బాలుడు మృతి చెందాడు.

ప్రశాంతి గ్రామంలో చోరీ

పుట్టపర్తి అర్బన్: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. బాధితులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం ప్రశాంతి గ్రామంలోని జానకీరామయ్య కాలనీలో నివాసముంటున్న శ్రీధర్ సోమవారం రాత్రి తన పిల్లల ఆరోగ్యం విషమించడంతో భార్యతో కలసి ఇంటికి తాళం వేసి సత్యసాయి ఆస్పత్రికి చేరుకున్నాడు. రాత్రంతా వారు అక్కడే ఉండిపోయారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్న వారు ప్రధాన ద్వారం తలుపులు బద్ధలై ఉండడాన్ని గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలోని 10 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ.5 వేలు నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పుట్టపర్తి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు.

ప్రజాపోరు యాత్ర జయప్రదం చేయండి

ధర్మవరం: ప్రజా సమస్యలపై చేపట్టిన ప్రజాపోరు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న కోరారు. పట్టణంలో మంగళవారం ప్రజాపోరు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఈనెల 8 నుంచి 14 వరకు ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ఆలకుంట మారుతి, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎస్ఎఫ్ఐ నాగార్జున, వెంకట్రాముడు, వీరన్న పాల్గొన్నారు.

కదిరి టౌన్: సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమం మంగళవారం కదిరి పట్టణంలో కొనసాగింది. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 27, 28, 33 వార్డులలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ క్యాంపెయిన్ నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జి.ఎల్.నరసింహులు ప్రజాపోరులో భాగంగా ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నా జయప్రదం చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

నారాయణకు ఉత్తమ అధ్యాపకుడి అవార్డు

కదిరి అర్బన్: కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నారాయణ ఉత్తమ అధ్యాపకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నెల 11న విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌లో సీఎం ఆయనకు అవార్డు అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు రావడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అధ్యాపకులు గుర్తుచేసుకున్నారు.

ఫుట్‌బాల్ చాంపియన్ 'మంగళకర'

పుట్టపర్తి అర్బన్: ఇటీవల ముగిసిన ఎస్కే యూనివర్సిటీ ఇంటర్ కళాశాలల ఫుట్‌బాల్ చాంపియన్‌గా పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర కాలేజీ జట్టు నిలిచింది. అనంతపురం జిల్లా గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ కళాశాల మైదానంలో 8, 9, 10 తేదీల్లో జరిగిన ఇంటర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మంగళకర డిగ్రీ కళాశాల జట్టు ఫైనల్‌లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. మంగళవారం క్రీడాకారులను కళాశాల బృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో మంగళకర మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

తాడిమర్రి: హైకోర్టు ఆదేశాల మేరకు యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలని మండల యానిమేటర్లు ఏపీఎం సాంబశివన్ని కోరారు. మండలంలోని తాడిమర్రి, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, పిన్నదరి, పెద్దకోట్ల, దాడితోట తదితర గ్రామాలకు చెందిన యానిమేటర్లు (వీఓఏలు) వెలుగు కార్యాలయంలో మంగళవారం ఏపీఎంకు వినతిపత్రం ఇచ్చారు.

జామియా మసీదును పరిరక్షించండి

కదిరి టౌన్: కుటాగుళ్ల గ్రామంలో జామియా మసీదు, ఈద్గా, ఖబరస్థాన్ పరిరక్షణ కోసం స్థానిక కుటాగుళ్ల ఈద్గా ఎదుట ముస్లింలు మంగళవారం శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం నాయకులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ 400 ఏళ్ల నుంచి కుటాగుళ్ల గ్రామ ముస్లింలు, జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మసీదు, ఈద్గా, ఖబరస్థాన్ సంరక్షణ చేస్తున్నామన్నారు. రోడ్డు విస్తరణలో 50 సెంట్ల ఈద్గా భూమి పోతోందని, దీనికి సంబంధం లేని కుటాగుళ్ల దర్గా పీఠాధిపతి కె.ఎస్.ఎస్.ఉబేదుల్లా అనే వ్యక్తి ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని కాజేందుకు కుట్ర పన్నాడన్నారు. పరిహారం కాజేయాలని చూస్తున్న ఉబేదుల్లాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రోడ్డు విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న జామియా మసీదు, ఈద్గా, ఖబరస్థాన్‌ను పరిశీలించారు. న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వర్, వక్ఫ్ బోర్డు అధికారులు, సీఐ నారాయణరెడ్డి, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో బుధవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ కొండారెడ్డి మంగళవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, మున్సిపల్ ఆఫీస్, కదిరిగేటు, చంద్రబాబునగర్, శివానగర్, కేశవనగర్, చిన్నూరు, గొట్లూరు ప్రజలు సహకరించాలని కోరారు.

రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయండి

ముదిగుబ్బ: ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ నారాయణస్వామికి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు శ్రీనివాసులు, తిప్పయ్య, రాధాకృష్ణ, శంకర్, మంగళి శీన, ఈశ్వర్ నాయక్, దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తాడిమర్రి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ ఎం.కె.సత్యనారాయణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఏపీఎం సాంబశివుడు అధ్యక్షతన జరిగిన 'ఉల్లాస్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీడీఓ వెంకట రంగారావు, ఎంఈఓ కృష్ణమోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ, ఎల్‌సీ లక్ష్మీనారాయణ, సీసీలు నారాయణమూర్తి, మస్తాన్, గంగాదర్, కళాజ్యోతి మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.సీతారామలక్ష్మి, యానిమేటర్లు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీడీఓ రామానాయక్ అధ్యక్షతన మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం రెడ్డి 160 మంది వలంటీర్లకు వయోజనులకు అక్షరాభ్యాసం ఎలా చేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు.

బీసీల అభ్యున్నతికి కృషి

ధర్మవరం అర్బన్: బీసీల అభ్యున్నతికి ఐకమత్యంతో కృషి చేస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు బండి వెంకటేష్ తెలిపారు. పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయం ప్రాంగణంలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ డైరెక్టర్లుగా బీసీ మల్లన్న, గిరక నాగేంద్ర, జింక ఈశ్వరయ్య, బాలం నాగరాజు, ఎర్రగుంట నాగేంద్ర, తాడిమర్రి ఆదినారాయణలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బీసీల సమస్యలపై నిరంతరం పోరాడుతామని వారు తెలిపారు. సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు గోకుల రవి, కార్యదర్శి జంగమన్న, సహాయ కార్యదర్శి బెల్లం తిరుపాలు, కోశాధికారి కొండయ్య పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కదిరి అర్బన్/ గాండ్లపెంట/ బత్తలపల్లి/ తాడిమర్రి: ఎంపీడీఓ కదిరి, గాండ్లపెంట, బత్తలపల్లి, తాడిమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఓ లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓలు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26పై వివరించారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ట

ముదిగుబ్బ: పూజారి తండాలో బుధవారం మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. వేద పండితుడు రఘునాథశాస్త్రి శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు.

16 నుంచి సబ్సిడీ వేరుశనగ పంపిణీ

ఎన్పీకుంట: రబీలో రైతులకు 40 శాతం సబ్సిడీతో ఈ నెల 16 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఏఓ లోకేశ్వరరెడ్డి మంగళవారం తెలిపారు. మండలానికి 900 క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరయ్యాయన్నారు. కే6, కే1694 రకం విత్తనకాయలు (ఒక బ్యాగుకు) సబ్సిడీ పోగా రూ.1,728, కే1812 లేపాక్షి రకం విత్తనకాయలకు (ఒక బ్యాగుకు) సబ్సిడీ పోగా రూ.1,530 రైతులు చెల్లించాలన్నారు.